
ఆంధ్రజ్యోతి



మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో అక్రమార్కులను అందలం ఎక్కిస్తున్నారు. గతంలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగిని మళ్లీ అదే పోస్టులో నియమించారు. కొద్ది రోజుల వ్యవధిలోనే ఇన్‌చార్జిగా కీలక బాధ్యతలు అప్పగించి మున్సిపల్ నిబంధనలకు పాతర వేశారు. మరో కీలకమైన మేనేజర్ పోస్టును ఇన్‌చార్జి అధికారితోనే నెట్టుకొస్తున్నారు. ఈ వ్యవహారాల వెనుక పెద్ద కథే నడిచిందనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమార్కులకు అందలం!

మచిలీపట్నం కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యం!

సస్పెండ్ అయిన ఉద్యోగికి మళ్లీ అదే పోస్టు కేటాయింపు

- కీలకమైన మేనేజర్ పోస్టులో ఇన్‌చార్జి అధికారి కొనసాగింపు
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం కార్పొరేషన్‌లో ఇద్దరు హెల్త్‌అసిస్టెంట్లు ఉన్నారు. మొత్తం 50 డివిజన్‌లలో ఒక్కొక్కరు 25 డివిజన్‌ల చొప్పున బాధ్యత చూస్తున్నారు. ఈ ఇద్దరు పారిశుధ్య కార్మికుల హాజరు, కాటిల్ డిపో నుంచి చెత్త సేకరించేందుకు వాహనాలను వినియోగించడం తదితర పనులను చూస్తూ ఉంటారు. వీరిలో ఒక హెల్త్ అసిస్టెంట్ గతంలో అక్రమాలకు పాల్పడటంతో అధికారులు సస్పెండ్ చేశారు. కొద్ది రోజులకే మళ్లీ అదే పోస్టులో చేరాడు. గతంలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగిని మళ్లీ ఇక్కడ అదే పోస్టులో నియమించడం నిబంధనలకు విరుద్ధమని, దీని వెనుక ఏం జరిగిందనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కాగా, ఇప్పటి వరకు మరో హెల్త్ అసిస్టెంట్‌ను రెండో ప్రాంతానికి ఇన్‌చార్జి హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించి పని చేయించుకుంటున్నారు. తెర వెనుక ఏం జరిగిందో కాని ఇన్‌చార్జి హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యోగి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయాడు. సదరు ఉద్యోగికి బలమైన కారణం చూపి సెలవు పెట్టించారని కార్యాలయ ఉద్యోగులు అంటున్నారు. ఈ పోస్టులో ఎవ్వరూ లేకపోవడంతో గతంలో సస్పెన్షన్‌కు గురై, కొద్దిరోజుల్లోనే మళ్లీ ఉద్యోగం పొందిన హెల్త్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి హెల్త్‌ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం వెనుక కార్పొరేషన్‌లో కీలక అధికారి అత్యుత్సాహం చూపారని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.



మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మేనేజర్ పోస్టులో ఇన్‌చార్జి అధికారే దిక్కు!

కార్పొరేషన్‌లో కీలకమైన మేనేజర్ పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగానే ఉంటోంది. ఈ పోస్టులో తనకు అనుకూలంగా ఉండే ఒక ఉద్యోగిని కమిషనర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఇన్‌చార్జి మేనేజర్ తన విధులను పట్టించుకోకుండా తిరుగుతున్నాడనే ఆరోపణలు ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. కార్యాలయానికి రావడం, తన బలహీనతకు అనుగుణంగా నలుగురిని తన చుట్టూ కూర్చోబెట్టుకుని కాలక్షేపం చేసి వెళ్లిపోతుండటంతో ఎక్కడి ఫైళ్లు అక్కడే పేరుకుపోతున్నాయని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఈ మేనేజర్‌ను మార్చివేస్తామని చెప్పడమే తప్ప, మార్చిన దాఖలాలు లేవని కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. నగరంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, రంగు మారిన నీరు వస్తున్నాయని నగర ప్రజలు మండిపడుతున్నారు. మచిలీపట్నం కార్పొరేషన్‌పై కలెక్టర్ దృష్టి సారించి ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

హాజరు నమోదులో అక్రమాలు!

మునిసిపల్ కార్పొరేషన్‌లో 480 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు వీరి హాజరును హెల్త్‌అసిస్టెంట్‌లు లేదా హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి రోజు పరిశీలించాల్సి ఉంది. 480 మందిలో 50 మందికి పైగా కార్మికులు నిత్యం విధులకు హాజరుకారు. దీంతో పాటు విధులకు హాజరయ్యేవారు వేరే ఉంటే మరొకరు పనిచేసేందుకు వస్తారు. కార్మికులు విధులకు గైర్హాజరైన విషయం తెలిసినా వారు హాజరైనట్లు హెల్త్‌అసిస్టెంట్‌లు మస్టర్ వేస్తారనే ఆరోపణలున్నాయి. ప్రతి రోజు తెల్లవారు జామున ఐదు గంటలకు డివిజన్‌లలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేదా మేస్త్రీలు విధులకు హాజరైన పారిశుధ్య కార్మికులకు సంబంధించిన ఫొటోలు తీసి, ప్రత్యేక యాప్‌లో హెల్త్ ఇన్‌స్పెక్టర్ లేదా హెల్త్‌అసిస్టెంట్లకు పంపాలి. వారు కార్మికులు విధులకు హాజరైనట్లు ఆన్‌లైన్‌లో ధ్రువీకరించాల్సి ఉంది. విధులకు హాజరు కాని పారిశుధ్య కార్మికులతో ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా, వారు విధులకు హాజరైనట్లు నమోదు చేయడంలో హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ తెర వెనుక చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో చెత్తసేకరించే వాహనాలకు ఆయిల్ కొట్టించడంలోనూ తప్పుడు లెక్కలు చూపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఆయిల్ కొనుగోలు, పారిశుధ్య కార్మికుల హాజరు వ్యవహారంలో ప్రతి నెలా పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంచంపట్టిన పల్లెలు

జిల్లాలో విజృంభిస్తున్న జ్వరాలు

- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు
- ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో డెంగీగా అనుమానం
- గత జనవరి నుంచి ఎనిమిది డెంగీ కేసులు నమోదు
- లెక్కలోకి రాని కేసులు మరెన్నో.. దోచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు



మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరం, విపరీతమైన ఒళ్లునొప్పులతో ప్రజలు మంచం పడుతున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే బాగా నీరసించిపోవడంతో డెంగీ లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. టెస్టులు, ప్లేట్‌లెట్స్ అంటూ వేల రూపాయలను ప్రైవేటు ఆస్పత్రులు వసూలు చేస్తున్నాయి. ఆయా మండలాలు, పురపాలక సంఘాల పరిధిలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక విధిలేని పరిస్థితుల్లో బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రితో పాటు, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్కసారిగా జ్వరం రావడం, తీవ్రమైన ఒంటి నొప్పులతో నడవలేని స్థితికి చేరుతున్నారు. ఆస్పత్రిలో చేరి మూడు, నాలుగు రోజులపాటు చికిత్స చేయించుకుంటే గాని సాధారణ స్థితికి రావడం లేదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 9,358 మంది జ్వరం బారిన పడినట్లు సమాచారం. ఇవి కాకుండా జిల్లాలో అనేక మంది టైఫాయిడ్ లక్షణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. వేల రూపాయలు వైద్యానికి ఖర్చుపెడుతున్నారు. జిల్లాలోని మచిలీపట్నం, కోడూరు, బంటుమిల్లి, పెడన, గుడివాడ. పెనమలూరు తదితర మిగతా 6లో..

కుంకుమార్చన

ప్రత్యక్షమా? పరోక్షమా?

- ఈ దసరా ఉత్సవాల్లో నిర్వహణపై మల్లగుల్లాలు
- కుంకుమార్చనలు రద్దు చేయాలని పోలీసుల ప్రతిపాదన
- రద్దు వద్దు.. కొనసాగించాలని సూచించిన ప్రభుత్వం
- ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే యోచన
- 12న జరిగే సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల్లో కుంకుమార్చనలను ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలా? లేదా పరోక్ష విధానంలోనా? అనే అంశంపై దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్ కసరత్తు చేస్తున్నారు. కుంకుమార్చనలను రద్దు చేయాలని పోలీసు అధికారుల నుంచి ప్రతిపాదనలు వస్తుండగా, దుర్గగుడి అర్చకులు మాత్రం ఉండాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లడంతో కుంకుమార్చనలు నిలుపుదల చేయటం ఎందుకని, కొనసాగించమని సూచించినట్టు తెలుస్తోంది.

12న ఖరారు చేసే అవకాశం

దసరా ఉత్సవాల్లో కుంకుమార్చనలు నిర్వహించటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనివల్ల వేలసంఖ్యలో వస్తున్న సామాన్య భక్తులు అవస్థలు పడుతున్నారు. అయితే, కుంకుమార్చనలను ప్రభుత్వం కొనసాగించమన్న నేపథ్యంలో పరోక్ష విధానంలో అయినా నిర్వహించాలని దేవదాయ శాఖ కమిషనర్, ఈవో భావిస్తున్నారు. టికెట్ తీసుకున్న వారికి పూజల లైవ్ లింక్ పంపుతారు. ఇందులోనే పూజా కార్యక్రమాన్ని వీక్షించాల్సి ఉంటుంది. పూజ పూర్తయ్యాక అమ్మవారి కుంకుమ, మిగతా 6లో..

పుస్తకం.. ఇక విద్యార్థుల ప్రతిభకు కొలమానం కానుంది. ఒక విద్యార్థి ఏ సబ్జెక్టులో అగ్రస్థానంలో ఉన్నాడు, ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడు.. అనే విషయాన్ని ఆ పుస్తకం తెలియజేస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి జవాబులను ఈ పుస్తకాల్లో రాయించనున్నారు. అదెలా అంటే..

పుస్తకమే ప్రామాణికం

ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం

- 1-10 వరకు ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో బుక్‌లెట్లు
- 72 పేజీలతో బుక్‌లెట్లు ఇవ్వాలని నిర్ణయం
- ఇకపై జవాబులు రాయాల్సింది అందులోనే..
- ప్రతి పరీక్షకు విద్యార్థి పురోగతి తెలుసుకునేందుకు దోహదం
- ఈనెల 11 నుంచి అమల్లోకి రానున్న కొత్త విధానం



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు విద్యార్థులతో ఓ ప్రశ్నకు జవాబు రాయించడానికి ఉపాధ్యాయులు వేర్వేరు విధానాలు అవలంబించేవారు. కొంతమంది ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుకు సంబంధించి జవాబులు రాయడానికి ఒక చిన్న పుస్తకాన్ని విద్యార్థులకు ఇచ్చేవారు. మరికొంతమంది ఉపాధ్యాయులు తెల్లకాగితాలు, రూల్ కాగితాలను ఇచ్చేవారు. ఇలా ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కో విధానంలో అసెస్‌మెంట్‌ను అమలు చేస్తుండటంతో అంతా ఒకే విధానంలో ఉండేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది.

72 పేజీలతో బుక్‌లెట్

విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మెటివ్ అసెస్‌మెంట్లు, రెండు సమ్మెటివ్ అసెస్‌మెంట్లు నిర్వహిస్తారు. వాటికి సంబంధించిన తేదీలను విద్యాశాఖ నిర్ణయిస్తుంది. ఈ నెల 11 నుంచి 13 వరకు ఎఫ్ఏ1 నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలకు జవాబులు రాయడానికి 72 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. ఒక తరగతిలో ఎన్ని సబ్జెక్టులు ఉంటాయో అన్నింటికీ ఒక్కో పుస్తకాన్ని ఇస్తారు. ప్రశ్నాపత్రాల్లోని జవాబులు ఈ పుస్తకాల్లో రాయాలి. ఫార్మెటివ్‌తో పాటు సమ్మెటివ్ ప్రశ్నాపత్రాల జవాబునూ ఇందులోనే రాయాలి. దీనివల్ల విద్యార్థుల పురోగతి ప్రమాణాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉంటాయని మిగతా 6లో..

అపహరణకు గురైన చిన్నారితో జీఆర్పీ పోలీసులు



కన్నకూతుర్ని అమ్మేశాడు

- రాజమండ్రిలో భిక్షాటన చేయించడానికే..
- రూ.5 వేలకు కొనుక్కున్న ఇద్దరు వ్యక్తులు
- చాకచక్యంగా పట్టుకున్న జీఆర్పీ పోలీసులు
- తల్లిని పిలిపించి పాప అప్పగింత
- తండ్రి సహా ముగ్గురు అరెస్టు

రైల్వేస్టేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కన్నకూతుర్ని రూ.5 వేలకు అమ్మేశాడు ఓ తండ్రి. అంతేకాకుండా తన కూతుర్ని ఎవరో అపహరించారని ఒకసారి, తప్పిపోయిందని మరోసారి రైల్వే పోలీసులకు తెలిపాడు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు తమదైనశైలిలో విచారణ చేశారు. చివరకు భిక్షాటన కోసం ఇద్దరు వ్యక్తులు పాపను బస్సులో తీసుకెళ్తుండగా గుర్తించి, రక్షించారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లాలోని వేటపాలేనికి చెందిన సైకం మస్తాన్ గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో తన మూడేళ్ల కుమార్తె శ్రావణిని విజయవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 1లోని రిజర్వేషన్ కౌంటర్ నుంచి ఎవరో అపహరించారని జీఆర్పీ మిగతా 6లో..

దీర్ఘాయుష్మాన్‌తో సామాన్యులకు నాణ్యమైన వైద్యసేవలు 8



నేడు రాఖీ పౌర్ణమి

సోదర ప్రేమకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా దుకాణాల్లో శుక్రవారం రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. రెండు రోజుల నుంచి ప్రత్యేక స్టాల్స్ పెట్టి మరీ వివిధ రకాల రాఖీలు విక్రయిస్తున్నారు. యువతులు వారి అభిరుచికి తగిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. రూ.10 నుంచి రాఖీలు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు స్వీట్స్, డ్రై ఫ్రూట్స్ విక్రయాలు కూడా పెరిగాయి. - (ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం) 6



పాఠశాల స్థలం పరిశీలన

- బందరులో పాఠశాల స్థలం ఆక్రమణపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం
- స్పందించిన మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు

భక్తుల లగేజీకి భద్రత ఎంత?

- దుర్గగుడిలో సిబ్బంది నిర్వహణ లోపం
- క్లోక్‌రూంలో మాయమవుతున్న లగేజీ

6

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్ 8



సీపీఆర్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న వైద్య విద్యార్థులు

వైద్య విజ్ఞానమే లక్ష్యంగా..

పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన

32 స్టాల్స్ ఏర్పాటు చేసిన వైద్య విద్యార్థులు

- ఆకట్టుకుంటున్న అస్థిపంజరం, శరీర అవయవాలు
- సందర్శించిన ఏడు వేల మంది విద్యార్థులు

8

రక్షణ బంధం

నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా





(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

'రక్షా బంధన్' తోబుట్టువులకు పవిత్రమైన పండుగ. ప్రతి కష్టంలో సోదరులు తోడుంటారనే విశ్వాసానికి గుర్తు. 'రాఖీ' పండుగ శ్రావణ మాసంలో జరుపుకుంటారు. సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుంది. రాఖీ అంటే రక్షణ అని అర్థం. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని.. ఎల్ల వేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తారు. రాఖీ పండుగను కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమిని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు.

● రక్షా బంధన్ వేడుక తరతరాలుగా వస్తోంది. ఈ పండుగకు సంబంధించి కొన్ని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వ్యాస భగవానుడి విష్ణు పురాణంలో రాఖీ పౌర్ణమిని 'బలేవా' అని పిలిచేవారు. బలి చక్రవర్తి మహా విష్ణువు భక్తుడు. ఆయన తన అపారమైన భక్తితో విష్ణువుని తనవద్దే ఉంచుకుంటాడు. విష్ణువు లేని వైకుంఠం వెలవెలబోతుండటంతో శ్రీ మహాలక్ష్మి 'పౌర్ణమి' నాడు బలి చక్రవర్తికి రాఖీ కట్టింది. లక్ష్మీదేవిని ఏంకావాలో కోరుకోమని బలి చక్రవర్తి అడగ్గా.. లక్ష్మీదేవి మహావిష్ణువును తనతో పంపాలని కోరడంతో వెంటనే అంగీకరిస్తాడు.



● మహాభారతంలో శ్రీకృష్ణుడు శిశుపాలుడిని సంహరించే సమయంలో అతడి వేలికి గాయమవుతుంది. ఆ సమయంలో ద్రౌపది తన చీర కొంగును చించి కృష్ణుడి వేలికి కట్టగా.. దానికి ప్రతిఫలంగా కృష్ణుడు ఎప్పటికీ నీకు రక్షణగా ఉంటానని ఆమెకు మాట ఇస్తాడు. తదనంతరం దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపహరణానికి ప్రయత్నించినప్పుడు కృష్ణుడు ఆమెను ఆదుకుంటాడు.

మార్కెట్లో రాఖీల సందడి

రాఖీ పండుగ నేపథ్యంలో నగరంలోని దుకాణాలు రకరకాల రాఖీల విక్రయాలతో జోరందుకున్నాయి. గత మూడురోజులుగా ప్రత్యేక స్టాల్స్ పెట్టి రాఖీలు విక్రయిస్తున్నారు. మార్కెట్లో రాఖీలు రూ.10 నుంచి రూ.3 వేలుపైనే ధరల్లో అందుబాటులో ఉన్నాయి. స్వీట్స్, డ్రై ఫ్రూట్స్ విక్రయాలు పెరిగాయి. శ్రావణ శుక్రవారం, రెండో శనివారం కలిసిరావడం.. స్కూళ్లు, కళాశాలలు సెలవు కావడంతో నగరంలో మార్కెట్ కూడళ్లు కిక్కిరిసిపోయాయి.

రక్షా బంధం మాటల్లో చెప్పలేనిది

- శంకర్, గుణదల

ఆర్మీలో క్లర్క్‌గా పనిచేస్తున్నా.. ప్రతి నాలుగేళ్లకోసారి ఉద్యోగ రీత్యా ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయి. ఎక్కడున్నా రాఖీ పండుగ నాడు అక్క వద్దకు తప్పకుండా వస్తాను. నాకు రాఖీ కట్టిన క్షణం ఆమె కళ్లలో ఆనందం చెప్పలేనిది. ఆమెకు ఏ కష్టం రాకుండా చూసుకుంటా.

నేనున్నాననే భరోసా ఇవ్వాలి

- చిరంజీవి, మాచవరం

ట్రావెల్ ఏజెన్సీలో పనిచేస్తున్నా. ఉద్యోగ రీత్యా ఎప్పుడు ఎక్కడ ఉంటానో తెలీదు. కానీ రాఖీ పండుగకు మాత్రం కుటుంబానికి అందుబాటులో ఉంటా. చెల్లి ఎక్కడ ఉన్నా అక్కడికి వెళ్లి తప్పనిసరిగా రాఖీ కట్టించుకుంటా. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మిస్ కాలేదు.







వరలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

» దుర్గగుడిలో వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడురోజుల పాటు జరగనున్న వార్షిక పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తెలిసీతెలియక చేసిన దోషాలను హరింపజేసేందుకు శ్రావణమాసం శుద్ధ త్రయోదశి, చతుర్ధశి, పౌర్ణమిలలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో శుక్రవారం కనకదుర్గమ్మమూలవిరాట్టు, ఉపాలయాలలో కొలువైన దేవతామూర్తులు, ఆలయంలోని ధ్వజస్తంభాలు.. అన్ని ముఖ్య ప్రదేశాలలోనూ



పవిత్రాలను ఆలయంలోకి తీసుకుని వస్తున్న ఈవో శీనానాయక్, కుటుంబ సభ్యులు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, తదితరులు

పవిత్రాలను ధరింపచేశారు. తొలుత ప్రత్యేకంగా తెప్పించిన పవిత్రాలకు పూజాది కార్యక్రమాలలో ఈవో శీనానాయక్ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, వేదపండితులు, అర్చకులు వివిధ వైదిక కార్యక్రమాలలో సహకరించారు. మూడు రోజులు పాటు హోమాది పూజాదికాలు నిర్వహిస్తారు.

శ్రావణశుక్రవారం పౌర్ణమికి ముందు వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మకు వేకువజామున స్నపనాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి దుర్గమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదం, తదితరాలతో పాటు మజ్జిగప్యాకెట్లు, చల్లటి తాగునీరు అందజేశారు. రద్దీ కారణంగా టికెట్ దర్శనాలను రద్దు చేసి, అన్ని క్యూలలోనూ భక్తులను ఉచితంగా అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతించారు.

నేడు గిరి ప్రదక్షణ

ప్రతి పౌర్ణమినాడు నిర్వహించే గిరిప్రదక్షిణ కార్యక్రమం శనివారం జరగనుంది. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపులోకి తీసుకునిరారని, కేవలం ప్రచార రథం మాత్రమే గిరి ప్రదక్షిణలో ఉంటుందని దేవస్థానం ఓప్రకటనలో తెలిపింది. ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి మందిరం నుంచి యధావిధిగా ఉదయం 5.55 గంటలకు గిరిప్రదక్షణ ప్రారంభమవుతుంది.



చిలకలపూడిలోని పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

పాఠశాల స్థలం పరిశీలించిన కమిషనర్

మచిలీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిలకలపూడి సెంటర్‌లో పాఠశాల స్థలాన్ని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు శుక్రవారం పరిశీలించారు. పాఠశాల స్థలం ఆక్రమణకు సంబంధించి 'కబ్జాకుట్రలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఏర్పాటు చేసిన బడ్డీకొట్టు తదితరాలను ఆయన పరిశీలించారు. రెవెన్యూ అధికారులు గతంలో పాఠశాలకు ఈ స్థలం కేటాయించినట్టుగా రికార్డుల్లో ఉందని, ఇది ప్రభుత్వ స్థలమేనని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

డైవర్షన్ రహదారిపై రాకపోకలు నిలిపివేత

తోటమూల(గంపలగూడెం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటమూల-వినగడప రహదారి మధ్యలోని కట్టలేరుపై నిర్మించిన డైవర్షన్ రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండటంతో శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి వాగులో వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో, ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ఈ రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. స్టాప్‌బోర్డులు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎగువన వర్షాలు పడుతుండడంతో, వాగులో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.



డైవర్షన్ రహదారిపై రాకపోకలు నిలిపివేసిన పోలీసులు

గుట్టలుగా బ్యాగులు.. నిర్లక్ష్యానికి నిదర్శనం

భక్తుల లగేజీకి భద్రత ఎంత?

» కాంట్రాక్టరు, సిబ్బంది నిర్వహణ లోపం
» క్లోక్‌రూంలో మాయమవుతున్న లగేజీ
» మౌలిక సౌకర్యాల కల్పనపై భక్తుల ఆగ్రహం
» దసరా ఉత్సవాలకైనా చక్కదిద్దాలని వినతి





దుర్గమ్మ దర్శనానికి వచ్చిన పిఠాపురానికి చెందిన గంగాధర్ కుటుంబసభ్యులు



కొండపైన గుట్టలుగా వేసిన భక్తుల బ్యాగులు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 8, (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల లగేజీకి భద్రత కరువైంది. రోజూ వేలమంది భక్తులు దుర్గమ్మ దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వస్తూ ఆలయంలో తమ బ్యాగులకు కనీస భద్రత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం విశిష్టత సందర్భంగా వేలాది భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. దేవస్థానంలో కొండపైన ఒకటి, కొండ దిగువన ఒకటి లగేజీ బ్యాగులు భద్రపరచుకునే పాయింట్లు ఉన్నాయి. అయితే బ్యాగులు ఉంచేందుకు సరిపడాలేని ఏర్పాట్లు, సిబ్బంది కొరత ఉంది. వేలాదిమంది భక్తులు వస్తారన్నది తెలిసి కూడా దేవస్థానం అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సంబంధిత కాంట్రాక్టరు తనకేమి పట్టనట్టు తూతూమంత్రంగా ఏర్పాట్లు చేసి చోద్యం చూస్తున్నారు. ఒకవైపు దేవస్థానం అధికారులు భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా అమలులో చిత్తశుద్ధి కనిపించడంలేదు.

గుట్టలుగుట్టలుగా బ్యాగులు పడవేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాగుకు రూ.15లు రుసుం వసూలు చేసినప్పటికీ కనీస భద్రత కల్పించడంలో విఫలమయ్యారు. వాస్తవంగా దేవస్థాన రుసుము బ్యాగుకు రూ.10కాగా అధికంగా రూ.15 వసూలు చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. రశీదు కూడా ఇవ్వకుండా పేపరు రాసి ఇస్తున్నారు. పిఠాపురానికి చెందిన గంగాధర్ కుటుంబసభ్యులతో దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. నాలుగు బ్యాగులను క్లోక్‌రూమ్‌లో భద్రపరచి దర్శనానికి కొండపైకి వెళ్లారు. దర్శనానంతరం క్లోక్‌రూమ్ వద్దకు వచ్చి చూడగా రెండు బ్యాగులు మాయమయ్యాయి. బాధితుడు సిబ్బందిని ప్రశ్నించగా అవి ఏమయ్యాయో తమకు తెలియదంటూ బుకాయించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేయగా బ్యాగులు తిరిగి ప్రత్యక్షమయ్యాయి. ఒక్కొక్క బ్యాగుకు రూ.15ల చొప్పున వసూలు చేశారని గంగాధర్ కుటుంబసభ్యులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం, హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన రావులస్వామి కుటుంబసభ్యులతో అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆరు బ్యాగులను క్లోక్ రూమ్‌లో భద్రపరచగా సిబ్బంది అతని నుంచి మొత్తం రూ.100ల వసూలు చేశారు. దీనిపై రావులస్వామి క్లోక్‌రూమ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల నుంచి ఇష్టానుసారంగా అదనపు రుసుము వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

కుంకుమార్చన ప్రత్యక్షమా.. పరోక్షమా?

(5వ పేజీ తరువాయి)

రాగి డాలర్, శేషవస్త్రం, చీర, ప్రసాదాలు వంటివి నేరుగా టికెట్ కొన్నవారి ఇంటికే పంపుతారు. పరోక్ష విధానాన్ని అమలు చేయాలని దాదాపు నిర్ణయించినా ఇంకా ఖరారు చేయలేదు. ఈనెల 12న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఖరారు చేసే అవకాశముంది.

అంతరాలయ దర్శనమే సమస్య

దసరా ఉత్సవాల్లో రెండు షిఫ్టుల విధానంలో కుంకుమార్చన నిర్వహిస్తారు. ఒక్కో షిఫ్టులో 125 మంది పాల్గొంటారు. రోజుకు 250 మంది ఉభయదాతలు ఈ పూజలో కూర్చుంటారు. వీరిలో 50 మంది మినహా మిగిలిన 200 మంది బయటివారికే అవకాశం కల్పిస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ కుంకుమార్చనలు చేసేవారి వెంట వారి కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారు వస్తున్నారు. వీరికి దర్శనం చేయించాల్సి ఉంటుంది. ఈ దర్శనాల సందర్భంలో ఉభయదాతలు, టికెట్ బుక్ చేసుకున్న ఇతరులు కూడా తమ వెంట వచ్చినవారిని దర్శనం కోసం తీసుకెళ్తున్నారు. వీరందరికీ అనధికారికంగా అంతరాలయ దర్శనం కల్పిస్తున్నారు. దీంతో అంతరాలయం రద్దీగా మారుతోంది. వీఐపీ క్యూ అంతా కిక్కిరిసిపోతోంది. రూ.500 లైన్‌లో వెళ్లేవారంతా ముఖద్వారం వరకూ వస్తారు.అప్పటికే ఆప్రాంతమంతా కిటకిటలాడిపోతుండటంతో రూ.500 టికెట్ క్యూలైన్ ముందుకు కదలట్లేదు. దీంతో ఏటా దసరా ఉత్సవాల్లో సమస్యలు తప్పట్లేదు.

పుస్తకమే ప్రామాణికం

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఒక ఎఫ్ఏకి, మరో ఎఫ్ఏకి మధ్య విద్యార్థుల్లో ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో తెలుస్తుంది. విద్యార్థులు రాసిన జవాబులను దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు రిమార్కులను రాయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక విద్యార్థి ఒక ప్రశ్నకు రాయాల్సిన జవాబు రాయకుండా మరో జవాబు రాస్తే అది కచ్చితంగా తప్పవుతుంది. దానికి ఉపాధ్యాయులు సున్నా మార్కులు వేస్తారు. అలా ఎందుకు రాశారో ఉపాధ్యాయులు ఆ జవాబుకు పక్కనే రిమార్క్ రాయాల్సి ఉంటుంది.

మంచంపట్టిన పల్లెలు

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో ఇటీవల కాలంలో జ్వరపీడితుల సంఖ్య అధికమైంది.

జిల్లాలో ఎనిమిది డెంగీ కేసులు నమోదు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 713 మందికి డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది మంది డెంగీతో బాధపడినట్టు వైద్యశాఖ అధికారులు లెక్కలు చూపుతున్నారు. పామర్రు, బంటుమిల్లి, ఉయ్యూరు, మచిలీపట్నం మండలాల్లో ఒక్కో కేసు చొప్పున, పెనమలూరు, గూడూరు మండలాల్లో రెండు కేసుల చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత రెండు నెలల వ్యవధిలో అధిక శాతం మంది డెంగీ బారినపడి మచిలీపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. వీరికి ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు, వైద్య చికిత్స కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

అందుబాటులో లేని కిట్లు

జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లకు డెంగీ లక్షణాలున్న వారు వస్తే ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు ఆరోగ్య కార్యకర్తలకు కిట్లు పూర్తి స్థాయిలో ఇంకా అందజేయలేదు. ఇచ్చిన కిట్‌లను అత్యవసరమైతేనే వాడాలనే షరతులు పెట్టారు. ఒక్కో పీహెచ్‌సీకి రోజుకు కనీసంగా 15 నుంచి 20 మందిపైగా జ్వరపీడితులు వస్తున్నారు. ఎవరికి డెంగీ టెస్టులు చేయాలో తెలియక వైద్య సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్న వారిని మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రికి పంపించేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు మచిలీపట్నం, విజయవాడలోని ప్రైవేట్ ల్యాబ్‌ల నుంచి ప్లేట్‌లెట్స్ తెచ్చుకుని ఎక్కించుకుంటున్నారు. డెంగీ ర్యాపిడ్ కిట్ పరీక్ష చేసేందుకు రెండు వేల రూపాయల వరకు ప్రైవేటు ల్యాబ్ యజమానులు వసూలు చేస్తుండటం గమనార్హం.

1,24,444 మందికి మలేరియా టెస్టులు

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు రెండో వారం వరకు 1,24,444 మందికి మలేరియా టెస్టులు చేశారు. ఎవరికీ మలేరియా నిర్ధారణ కాలేదు. 9,358 మంది విషజ్వరాల బారిన పడినట్లు నిర్ధారించారు. టైఫాయిడ్ టెస్టులు 4,880 మందికి నిర్వహించగా, 1,080 మంది టైఫాయిడ్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు.

మొక్కుబడిగా పారిశుధ్య చర్యలు

వర్షాలు పడుతున్న వేళ పంచాయతీల్లో పారిశుధ్య పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. దీంతో పల్లెల్లో విషజ్వరాల వ్యాప్తి అధికమవుతోంది. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో దోమలు పెరుగుతున్నాయి. వాటి నివారణకు ఫాగింగ్ కూడా సక్రమంగా చేయనిస్థితి నెలకొంది. గ్రామాల్లో పారిశుధ్య పనులకు చేసేందుకు నిధుల కొరత వేధిస్తున్నట్టు తెలిసింది.

కన్నకూతుర్ని అమ్మేశాడు

(5వ పేజీ తరువాయి)

పోలీసులకు తెలిపాడు. దీంతో జీఆర్పీ సీఐ రమణ తన సిబ్బందితో వెతుకులాట ప్రారంభించారు. రైల్వేస్టేషన్ బయట, పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు పాపను ఓ ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. విశాఖపట్నం వైపునకు వెళ్తున్న ఏపీ 40జెడ్ 0021 బస్సులో పాప, ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించి బస్సు డ్రైవర్ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. రాజమండ్రి జీఆర్పీ పోలీసుల సహకారంతో శుక్రవారం పాపను రక్షించి ప్రకాశం జిల్లా వేమవరానికి చెందిన బొల్లా శ్రీనివాసులు, అల్లూరి సీతారామరాజు జిల్లా వేమవరానికి చెందిన సడేల చిన్నారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడ తరలించారు. కాగా, పాపను రూ.5 వేలకు విక్రయించానని మస్తాన్ ఒప్పుకొన్నాడు. రాజమండ్రిలో భిక్షాటన చేయించడానికి తీసుకెళ్తున్నామని ఆ ఇద్దరు వ్యక్తులు కూడా అంగీకరించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురినీ అరెస్టు చేశారు. కాగా, పాప తల్లి వెంకటేశ్వరమ్మను విజయవాడకు రప్పించి విచారణ చేయగా, మస్తాన్ తన నుంచి నాలుగు నెలలుగా దూరంగా ఉంటున్నానని, రెండు రోజుల క్రితం తన చిన్న కుమార్తె శ్రావణిని అపహరించుకుని వెళ్లాడని తెలిపింది. వెంకటేశ్వరమ్మ ఫిర్యాదుతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తన మూడో కుమార్తెను కూడా మస్తానే అమ్మేశాడని వెంకటేశ్వరమ్మ తెలిపింది.

28న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

» వామపక్షాల నేతల పిలుపు

గవర్నర్‌పేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఈ నెల 28న ప్రతిజ్ఞ దినం పాటించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఎంబీ రోడ్డులోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం 10 వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు అధ్యక్షత జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలపై వేసిన కోట్ల రూపాయల భారాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తరువాత అదే విధానాలను కొనసాగిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం నిలబడతామని మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం దానికి సొంత గనులు కేటాయింపు విషయంలో మాట్లాడకుండా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని చెబుతూ వాస్తవంలో అందుకు భిన్నంగా వ్యవహరించడం పబ్లిక్ రంగ పరిశ్రమను నాశనం చేయడమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నేతలు సీహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నేత పి.ప్రసాద్, సీపీఐ (న్యూడెమోక్రసీ) నేతలు పొలారి, రామకృష్ణ, ఎంసీపీఐ (యూ) నేతలు శివయ్య, సుభానీ, ఎస్‌యూసీఐ (సీ) సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సీపీఎం కార్యాలయంలో జరిగిన వాపపక్ష పార్టీల సమావేశంలో పాల్గొన్న నేతలు

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

» మంత్రి నాదెండ్ల మనోహర్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని మైలవరం నియోజకవర్గ నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. తెనాలి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయనను మైలవరం నియోజకవర్గనాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈమేరకు ఇటీవల నామినేటెడ్ పోస్టులు పొందిన జనసేన నేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో జనసేన నియోజవకర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), మైలవరం ఏఎంసీ చైర్మన్ పొనకళ్ల నవ్యశ్రీ, ఆకుతోట లక్ష్మితులసి, తదితరులు పాల్గొన్నారు.

నాట్యకళను పాఠ్యాంశంలో చేర్చాలి

» ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వేదాంతం రాధేశ్యాం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నాట్యకళను పాఠ్యాంశంగా చేర్చాలని ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వేదాంతం రాధేశ్యాం కోరారు. మచిలీపట్నం బచ్చుపేట వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం నర్తకి చలమలశెట్టి తేజస్వి అరంగేట్రం కార్యక్రమం నిర్వహించారు. భరతనాట్య రీతిలో నిర్వహించిన కార్యక్రమంలో వేదాంతం రాధేశ్యాం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భరతముని నాట్య సంప్రదాయానికి మూల పురుషుడన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో నాట్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. లలిత కళల్లో ఒకటైన నాట్యంలో మిగిలిన కవిత్వం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం దాగి ఉన్నాయన్నారు. నర్తకికి గురువు రమ్య నట్టువాంగం అందించగా, అరుణ్ గాత్రానికి వయొలిన్‌పై సిద్ధి వినాయక్, మృదంగంపై వివేక్ సహకరించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరభక్త సంఘం నిర్వాహకులు కెఎల్ఎన్ ఆచార్యులు, చలమలశెట్టి నాగమురళి, లక్ష్మీదేవి ఆలయ కార్యనిర్వహణాధికారి గోవాడ కృష్ణారావు పాల్గొన్నారు.





కళాకారిణిని అభినందిస్తున్న ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వేదాంతం రాధేశ్యాం, తేజస్వి నాట్యం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

తాడిగడప మునిసిపాలిటీలో కమిషనర్ పర్యటన

కానూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తాడగడప మునిసి పాలిటీలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పర్యటించారు. కానూరుతోపాటు తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకున్నారు. త్వరిత గతిన శానిటేషన్ పనులను చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అదే విధంగా భగత్‌సింగ్ నగర్‌లో నీటిపైపు పగిలి నీరు వృధాగా పోతుందని ఫిర్యాదు అందడంతో అక్కడ పరిశీలించి పనులు చేయించారు. ఆయన వెంట పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ నజీర్

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకొనే స్థాయి తక్కువగా ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పెనమలూరు మండలానికి చెందిన 18 మందికి షుమారు రూ. 11.36 లక్షలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6.43 కోట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకొని నగదు చెల్లించుకోలేని పేదవారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం చేయడం ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోయ ఆనంద్ ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, సంగెపు రంగారావు, తోటకూర ఉదయభాస్కర్, చెన్నుపాటి శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్, మాబు సుబాని తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామ కానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గురువారం నోటీసు విడుదల చేసినట్లు దేవస్థానం ఈవో తారకేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసు వెలువడిన 20 రోజులు లోపు దేవ దాయ ధర్మాదాయ శాఖ అధికారులకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈవో పేర్కొన్నారు.



వ్యానులో తరలిస్తున్న వీధికుక్కలు

వీధికుక్కల నుంచి విముక్తి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పాటు వాహనదారులకు ప్రమాదకరంగా తయారైన వీధికుక్కల బెడదను పంచాయితీ పాలకవర్గం ఎట్టకేలకు తొలగించింది. వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత, రామారావు, ఉపసర్పంచ్ లంక అజయ్ పర్యవేక్షణలో శుక్రవారం పంచాయితీ సిబ్బంది గ్రామంలో వీధికుక్కలను పట్టుకుని వ్యాన్‌లో దూరప్రాంతానికి తరలించారు. వీధి కుక్కలు రాత్రి సమయాల్లో గుంపులుగా సంచరిస్తూ విధులు ముగించుకుని వెళ్లే వాహనాదారులు, రైతులతో పాటు ట్యూషన్లు ముగించుకుని వెళ్లే విద్యార్థులపై దాడి చేస్తున్నాయని, ప్రజలు వీటి బారిన పడి ప్రమాదాలకు గురవడంతో ఈ చర్య తీసుకున్నట్లు వారు వివరించారు.



తెలంగాణ ప్రభుత్వం నుంచి రాజీవ్ పురస్కార్ అవార్డు అందుకుంటున్న మైథిలి

నృత్యకారిణి మైథిలికి పురస్కారం

ఉయ్యూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గండిగుంటకు చెందిన ప్రముఖ నృత్యకారిణి చిన్నారి ఎంవిఎస్ఎన్ మైథిలి తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక రాజీవ్ ప్రతిభ పురస్కార్ అవార్డు అందుకుంది. సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్, తెలంగాణ ప్రభుత్వం భాష, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాజీవ్ సద్భావన దివాస్ పేరుతో హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం రాత్రి జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ పటేల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధుల నుంచి మైథిలి అవార్డు అందుకున్నారు. రాజీవ్ ప్రతిభ పురస్కార్ అవార్డు అందుకోవడం పట్ల పలువురు ప్రముఖులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

బందరు రోడ్డులోని హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

కానూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కానూరు బందరు రోడ్డులోని పలు హోటళ్లపై శుక్రవారం సాయంత్రం తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఖలీల్ బాయ్ రెస్టారెంట్, నవాబ్ హోటల్, కేఎఫ్‌సీ సెంటర్‌పై దాడులు నిర్వహించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలోని ఆహార పదార్థాల నాణ్యత, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిని ఆయన పరిశీలించారు. రెస్టారెంట్‌లోని వినియోగదారులతో మాట్లాడారు. హోటళ్ల, రెస్టారెంట్‌లలో పారిశుధ్య నిర్వహణ పెరగాలని, సరైన నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ కుమార్‌తో పాటు శానిటరీ మేస్త్రులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఉదయం 8 నుంచి 9.30 మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. యనమలకుదురు గ్రామం, డొంకరోడ్డు, శ్రీనగర్ కాలనీ, ఎంవీఆర్ కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

కానూరు: మహదేవ్‌పురం కాలనీ, కానూరు సబ్‌స్టేషన్‌లోని టీచర్స్‌కాలనీ, నాగార్జున ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, కానూరు 80 అడుగల రోడ్డు, పంట కాలువ రోడ్డు, బందరురోడ్డు ధనేకుల ఫంక్షన్ హాలు నుంచి మారుతీ షోరూం రోడ్డు వరకు, ఓల్డేజ్ హోమ్ రోడ్డు, చలసాని నగర్, మైత్రీనగర్, ఎండో మెంట్ కాలనీ, కామయ్య తోపు సెంటర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రసాదంపాడు : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు నిడమానూరు, ఏలూరు రోడ్డు, రామనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ నుందని ఏఈ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పాడిపరిశ్రమ ప్రోత్సాహానికి కృషి

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



పాడిరైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి) : రైతు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలచేందుకు పాడిపరిశ్రమను ప్రోత్సహించే విధంగా కృష్ణామిల్క్ యూనియన్ వినూత్న పథకాలతో కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకులపాడు పాలసొసైటీలో శుక్రవారం బోనస్‌లను ఆయన పంపిణీ చేశారు. 61మంది పాడిరైతులకు గాను రూ.90030 బోనస్ (2025-26 మొదటి విడత) పంపిణీ చేశారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలో రోజుకు 63 లీటర్ల పాలు సరఫరా చేస్తూ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రథమ స్థానంలో నిలచారు. పాడిరైతులతో ఆయన ముఖాముఖి నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ పట్ల ఆసక్తి ఉన్న వారి సహకారంతో పేద యువతకు ఉపాధి కల్పించేలా వెటర్నరీ హాస్టల్ లాంటి పథకంతో పాటు పశువులకు పచ్చిగడ్డి, నాణ్యమైన దాణా అందించే విధంగా ప్రభుత్వ సహకా రంతో పచ్చిగడ్డి విత్తనాలు ఉచితంగా అందించేలా యూనియన్ కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాడిరైతులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటికి వేసిన తాళాలు పగలకొట్టి రూ.80వేలు విలువ చేసే బంగారం, వెండి ఆభర ణాలను అపహరించిన ముగ్గురు నిందితులను శుక్రవారం జంక్షన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్ఎల్.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓగిరాల గ్రామానికి చెందిన జుత్తు రంగమ్మ ఉపాధి నిమిత్తం గత నెల 4న ఇంటికి తాళం వేసి ఖమ్మం వెళ్లింది. 23న తాళాలు పగలకొట్టి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారం, వెండి అభరణాలను అపహ రించినట్లు గ్రామస్తులు సమాచారం అందించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఏలూరుకు చెందిన ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా, గుడివాడకు చెందిన పటమట మణికంఠ, కాకినాడకు చెందిన కొటారి శ్రీనివాసులు కలిసి చోరీకి పాల్ప డినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల వద్ద ఆభరణాలను స్వాధీనం చేసుకొని నూజివీడు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

కంకిపాడులో మెగా నేత్ర వైద్యశిబిరం రేపు

కంకిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా మెగా నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరి కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు, తుమ్మలపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మ లపల్లి హరికృష్ణ కార్యాలయ ఆవ రణలో మెగా నేత్ర వైద్యశిబిరం బోడె వెంకట్రామ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. కంకిపాడుతో పాటు మండలంలోని 20 గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంకిపాడు పరిసర గ్రామాల్లో ఆదివారం ఉదయం ఆటోలను ఏర్పాటు చేయనున్నట్లు తెలియ జేశారు. గ్రామాల్లోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

ఉయ్యూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రం అధోగతిపాలై, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలబెట్టుకుంటున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాటూరులో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం చేసి ముఖ్యమంత్రికి అండగా నిలవాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సజ్జా మధు, తెలుగు యువత నాయకులు కోడె హరీశ్, రామ కృష్ణ, యుగబాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.



కాటూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో దండమూడి చౌదరి



కొత్తపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులు

కోడూరుపాడు, ఉమామహేశ్వరపురంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను కల్పిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించేలా అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి చిన్నాల చిన్నా అన్నారు. కొత్తపల్లి, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమా భివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కొత్తపల్లిలో అధ్యక్షుడు వల్లూరిపల్లి నాని, కర్రా ప్రసాద్‌పాల్, తదితరులు పాల్గొన్నారు. ఉమామహేశ్వరపురంలో టీఎన్‌టీయూసీ నాయకుడు పాండురంగారావు, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, గండి శ్రీను, పూడి శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

భక్తులతో కిటకిట .. వైభవంగా వరలక్ష్మి వత్రాలు..

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్థానిక బాపులపాడు శివాలయంలో భ్రమరాంభిక అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి చీరతో అలంకరించారు. నూజివీడు రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి, రాజరాజేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, బొమ్మిశెట్టి రామారావు తదితరులు పర్యవేక్షించారు.

గన్నవరం : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వరలక్ష్మీవ్రతం శ్రావణ శుక్రవారం 14వ రోజు మానుపూజ, గ్రామ పొంగళ్లు సమర్పించారు. అమ్మ వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పొట్ల శ్రీహరి, శ్రీలక్ష్మీ దంపతులు, నర్రా, భ్రమరాంబ దంపతులు ప్రసాద వితరణ చేశారు. భక్తులతో ఆలయం కిట కిటలాడింది. గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మకు కరెన్సీనోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీ సహస్రనామ పూజలు, లక్ష్మీఅష్టోత్తరం, హనుమాన్‌చాలీసా పారాయణం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తదితర భక్తులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని మండలంలో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం(మూడవ శుక్రవారం)వరలక్ష్మీదేవిని ఆరాధిస్తూ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులోభాగంగా మహిళలు తమ కుటుంబసభ్యులతో కలిసి ఇళ్లల్లో లక్ష్మీదేవి, గణపతి ప్రతిమలు/చిత్రపటాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తొమ్మిది రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించి, సిరిసంపదలు ప్రసాదించాలని లక్ష్మీదేవికి మొక్కుకున్నారు. చివరగా ముత్తైదువలకు పసుపు, కుంకుమలు, పిండివంటలను వాయనాలు అందించి వ్రతాన్ని పూర్తిచేశారు.

కానూరు : కానూరు గ్రామంలో శ్రావణ శుక్రవారం వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని మహిళలు తమతమ ఇళ్లలో వరలక్ష్మి వత్రాలు నిర్వహించారు. కాగా స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో పార్వతి అమ్మవారికి వరలక్ష్మి సహస్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం పూజారులు ఫణీ, కృష్ణఫణిలు మహిలతో కుంకుపూజలు చేయించారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి ఆలయం, రామాలయం, కామయ్యతోపులోని శ్రీగీత సాయి మందిరం, కేసీపీ కాలనీ, తాడిగడప వందఅడుగల రోడ్డులోని షిర్డిసాయి ఆలయాలు శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వామివార్లకు భక్తులు పూజలు నిర్వహించారు.



లక్ష్మీతిరుపతమ్మకు గ్రామ పొంగళ్లు తీసుకువెళ్తున్న భక్తులు



జంక్షన్‌లో వరలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కానూరులోని శివాలయంలో పార్వతి అమ్మవారికి సహస్ర కుంకుమపూజ చేస్తున్న మహిళలు



రోడ్డు టెస్టుకు వెళ్లిన బస్సు దగ్గర సిబ్బందితో ఏపీఎస్ ఆర్టీసీ డీపీటీవో కె.వెంకటేశ్వర్లు

బస్సులన్నీ కండీషన్‌లో ఉంచాలి

ఏపీఎస్ ఆర్టీసీ డీపీటీవో కె.వెంకటేశ్వర్లు

గన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బస్సులన్ని కండీషన్‌లో ఉంచాలని ఏపీఎస్ ఆర్టీసీ డీపీటీవో కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ఈ నెల 15న అమలు కానున్న స్త్రీ శక్తి పథకానికి బస్సులన్ని పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. బస్సులను రిపేరు చేసిన తరువాత రోడ్ టెస్టుకు తీసుకువెళ్లి పరిశీలించాలన్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా బస్ స్టేషన్‌లో సీట్లు, ఫ్యాన్‌లు, లైటింగ్, మంచినీటి సదుపాయం, టాయిలెట్ ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్స్‌తో పాటు పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. బస్సులను తనిఖీ చేసి డోర్‌లకు హ్యాంగర్‌లు ఉండేలా చూడాలన్నారు. డిపో మేనేజర్ పి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనిల్‌కుమార్

సీఎం, గవర్నర్, చీఫ్ జస్టిస్‌లతో ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ భేటీ

- మౌలిక సదుపాయాలపై చర్చ
- ఐటీ శాఖకు సహకారానికి కృతజ్ఞతలు

వన్‌టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ శుక్రవారం ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన గవర్నర్, సీఎంలతో పాటు ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదాయపు పన్ను సేవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు అందజేశారు. మౌలిక సదుపాయాల కోసం భూమి కేటాయింపు, పన్నుల చెల్లింపుదారుల సేవలను మెరుగుపర్చడం వంటి అంశాలను ఆయన చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత వరకు అన్ని సహకారాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎం.అనిల్ కుమార్‌తో పాటు హైదరాబాద్ సీసీఐటీ సురేష్ బాబు, విజయవాడ సీసీఐటీ రాయ్‌పురా జయరామ్, విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా, విజయవాడ సీఐటీ (టీడీఎస్) వి.జనార్థనన్ ఉన్నారు. ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ హెడ్‌క్వార్టర్స్-2 ఐవీ వర్ధని తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ ధర్నాలో పాల్గొన్న సీపీఎం నేత శ్రీనివాసరావు తదితరులు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం : సీపీఎం

ధర్నాచౌక్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దీని లక్ష్యం దేశంలోని ప్రజలకు ఓటును నిరాకరించడమేనన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో టీడీపీ, వైసీపీ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. లేదంటే భవిష్యత్‌లో ఆయా పార్టీల మనుగడ, ఉనికి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా టీడీపీ పార్లమెంట్ సభ్యులు ఎన్నికల కమిషన్‌కు లేఖ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎన్నికల కమిషన్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి తొత్తుగా, కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబురావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2029లో మరలా అధికారం చేపట్టాలనే ఉద్దేశంతో బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో భారత్ బచావో నేత భాస్కరరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, నగర ప్రముఖుడు చుక్కపల్లి తిరుమలరావు, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆంజనేయులు, సీపీఎం నేతలు డీవీకృష్ణ, మాల్యాద్రి, ఎన్ సీహెచ్.శ్రీనివాస్, దుర్గారావు, బోయి సత్యబాబు, పి.కృష్ణ, పాల్గొన్నారు.



డీఎస్సీలో వెయిటేజీ కోరుతూ ధర్నాలో పాల్గొన్న ఏఐవైఎఫ్, ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి నాయకులు

మెగా డీఎస్సీలో వెయిటేజ్ మార్కులు కల్పించాలి

- వ్యాయామోపాధ్యాయుల ధర్నా

ధర్నాచౌక్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు వెయిటేజ్ మార్కులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలకు ఎంపిక చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐవైఎఫ్, ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. మెగా డీఎస్సీ నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల విషయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ శిక్షణ పొందిన అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. కాలేజీలకు వెళ్లకుండాసర్టిఫికెట్లే తెచ్చుకుని డైరెక్టుగా పరీక్ష రాసిన వాళ్లు డీఎస్సీలో ఎక్కువ మంది ఉన్నారన్నారు. ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్ష నిర్వహించడం వల్ల వ్యాయామ ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ 1:3 రేషియోలో పిలవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నరసింహులు, మధుసూదన్, అనిల్, రమణయ్య, చెల్లయ్య, అర్జున్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలు

భార్య ఎదుటే భర్త ఆత్మహత్య



మృతుడు రాజేంద్రరెడ్డి

జగ్గయ్యపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యపై కోపంతో భర్త ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగ్గయ్యపేటలోని కోదాడ రోడ్డులో కోర్టు సమీపంలో జరిగింది.

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన మండ్ల రాజేంద్రరెడ్డి (35) స్థానిక ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రాజేంద్ర రెడ్డికి కొద్ది నెలల క్రితం గండ్రాయి గ్రామానికి చెందిన పూజిత (18)తో వివాహమైంది. కోర్టు ఎదురుగా ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం ఉంటున్నారు. భార్య ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందనే అనుమానంతో తరచూ గొడవలు పడుతున్నారు. గురువారం అదే విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. సాయంత్రం భార్య బయటకు వెళ్లిన సమయంలో రాజేంద్ర ఫ్యాన్‌కు ఉరేసుకునే ప్రయత్నం చేస్తుండగా, గమనించిన పూజిత వారించే ప్రయత్నం చేసింది. గండ్రాయిలో ఉన్న సోదరుడికి ఫోన్ చేసి చెప్పింది. అతడు వచ్చి తలుపులు పగలగొట్టి రాజేంద్రను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలో ఉంటున్న రాజేంద్రరెడ్డి తండ్రి వెంకటరెడ్డి కోడలిపై అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేశారు. రాజేంద్రరెడ్డి ఆత్మహత్య చేసుకునే దృశ్యాలన్నీ ఇంట్లో ఉన్న సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఎస్సై జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైఎస్ విగ్రహం తొలగించిన ప్రదేశం



బారికేడ్లను తోసుకువస్తున్న వైసీపీ శ్రేణులు



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

వైఎస్ విగ్రహం తొలగింపు

- నాడు కుట్రతో నేతల విగ్రహాల తొలగింపు
- నేడు కౌన్సిల్ తీర్మానంతోనే..
- ప్రతిన నెరవేర్చుకున్న తంగిరాల కుమార్తె

అధికారంలో ఉండగా అడ్డగోలుగా వ్యవహరిస్తే ప్రతిపక్షంలోకి రాగానే ఫలితం అనుభవించాలన్న విషయాన్ని వైసీపీ నాయకులు ఆలస్యంగా తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో 2024లో రోడ్ల విస్తరణ పేరుతో జాతీయ, స్థానిక నాయకుల విగ్రహాలను అర్ధరాత్రి తొలగించి నందిగామ మునిసిపల్ కార్యాలయంలో టాయిలెట్ల పక్కన పడేశారు. తన తండ్రి విగ్రహంతో పాటు జాతీయ నాయకుల విగ్రహాలను పడవేయడంతో తంగిరాల సౌమ్య మనోవేదనకు గురయ్యారు. తాము అధికారంలోకి రాగానే వైఎస్ విగ్రహానికి ఇదే గతి పట్టిస్తానని ఆమె ప్రతినబూనారు. అదే తీరున మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం ద్వారానే వైఎస్ విగ్రహాన్ని శుక్రవారం తొలగింపజేసి వైసీపీకి ఝలక్ ఇచ్చారు.

నందిగామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ నిధులు రూ.16 లక్షలతో నిబంధనలకు విరుద్ధంగా ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని 2023లో వైసీపీ పాలకులు ఏర్పాటు చేశారు. అయితే, 2024లో నందిగామలోని గాంధీ సెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ, అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే, ఎన్టీఆర్, భగత్‌సింగ్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, దేవినేని వెంకటరమణ, పొట్టి శ్రీరాములు, తంగిరాల ప్రభాకరరావు, డాక్టర్ కెఎల్‌రావ్ వంటి ప్రజాదరణ గల నేతల విగ్రహాలను రోడ్డు విస్తరణ పేరుతో వైసీపీ పాలకులు తొలగించారు.

వైఎస్ విగ్రహాన్ని మాత్రం అలానే ఉం చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అందరితో పాటు వైఎస్ఆర్ విగ్రహం కూడా తొలగించాలని అప్పుడు టీడీపీ నాయకులు సూచించారు.

అప్పట్లో ప్రజా సంఘాలు, కుల సంఘాలు విగ్రహాలు తొలగించవద్దని ఆందోళన చేపట్టినా ఎట్టించుకోకుండా అర్ధరాత్రి వేళ విగ్రహాలు తొలగించి మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆలానే ఉంచి ఇతర నాయకుల విగ్రహాలను టాయిలెట్ పక్కన పడవేశారు. దీంతో తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో ర్యాలీలు, రాస్తారోకో నిర్వహించారు.

వైసీపీ నాయకుల ఆందోళన

వైఎస్ విగ్రహాన్ని తొలగించి అధికారులు మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. మూడు రోజుల పాటు సెలవు దినాలు కావడంతో కార్యాలయం గేటుకు తాళం వేసి సీలు వేశారు. విగ్రహానికి రక్షణగా పోలీసులను నియమించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, గౌతంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆందోళనకు దిగారు. విగ్రహాన్ని తొలగించడంపై నిరసన తెలిపారు. ఎవరికీ అడ్డం లేక పోయినా కేవలం రాజకీయ కక్షతోనే విగ్రహాన్ని తొలగించారని ఆరోపించారు. మునిసిపల్ కార్యాలయంలో వైఎస్ విగ్రహాన్ని చూసే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులను, బారికేట్లను నెట్టుకొని దూసుకొచ్చి తాళం పగలగొట్టి మునిసిపల్ కార్యాలయంలోకి ప్రవేశించారు. వైఎస్ విగ్రహాన్ని పరిశీలించి నినాదాలు చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విగ్రహాన్ని అక్రమంగా తొలగించారని ఫిర్యాదు చేశారు.

సౌమ్య శపథం ఇలా..

తన తండ్రి తంగిరాల ప్రభాకరరావు విగ్రహంతో పాటు అభిమాన నాయకులు అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే, ఎన్టీఆర్ వంటి నేతల విగ్రహాలను మునిసిపల్ కార్యాలయంలో టాయిలెట్ల పక్కన చూసిన ఆమె చలించిపోయారు. వైఎస్ఆర్ విగ్రహానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఇతర నాయకులను అవమానించారని ఆమె ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే వైఎస్ విగ్రహాన్ని తొలగిస్తామని శపథం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ విగ్రహం తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. మునిసిపల్ పీఠాన్ని దక్కించుకున్న టీడీపీ వెంటనే వైఎస్ విగ్రహంపై దృష్టి సారించింది. మేలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైఎస్ విగ్రహ తొలగింపుకు నిర్ణయం తీసుకున్నారు. కౌన్సిల్ ఆమోదంతో శుక్రవారం అధికారులు వైఎస్ విగ్రహాన్ని తొలగించి అదే మునిసిపల్ కార్యాలయానికి తరలించారు.

నాడు అవమానించి..నేడు గగ్గోలు : టీడీపీ ఎద్దేవా

జాతీయ నాయకుల విగ్రహాలను అవమానించిన వైసీపీ నాయకులు తమ నాయకుడి విగ్రహం కోసం గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ, నాడు అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ నాయకుల విగ్రహాలను టాయిలెట్ల పక్కన పడవేసి అవమానించారన్నారు. అప్పట్లో సౌమ్యను మహిళ అని చూడకుండా రోడ్డుపై ఈడ్చి పడవేశారని గుర్తు చేశారు. అభివృద్ధి చేయడం చేతగాని మొండితోక సోదరులు విగ్రహాల పేరుతో రాజకీయాలు చేశారని ఆరోపించారు. చట్టబద్ధంగానే విగ్రహాన్ని తొలగించినట్లు చెప్పారు. గేట్లు ధ్వంసం చేస్తూ లోనికి చొచ్చుకు వచ్చి వైసీపీ నాయకులు విధ్వంస ప్రవృత్తిని నిరూపించుకున్నారన్నారు.



దీర్ఘాయుష్మాన్ యాప్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

- దీర్ఘాయుష్మాన్ యాప్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఇంటి వద్దనే వైద్యసేవలు అందించడమే లక్ష్యం : రవిచంద్ర

గుడివాడ, అగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో దీర్ఘాయూష్మాన్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించినట్లు దీర్ఘాయుష్మాన్ సంస్థ వ్యవస్థాపకులు మద్దినేని రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని సీఎం చాంబర్‌లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమక్షంలో దీర్ఘాయూష్మాన్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారన్నారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు బైక్ అంబులెన్స్ వంటి అత్యవసర వైద్యసేవలను బుక్ చేసుకోవచ్చన్నారు. వైద్య విభాగానికి సంబంధించిన అనేక ఇతర సేవలను నేరుగా ఇంటివద్దే పొందే అవకాశం కల్పించామన్నారు. ఆధునిక వైద్య సాంకేతిక పరికరాలతో ఇంటి వద్ద ఎక్కడ అవసరమైతే అక్కడ వైద్యసేవల ను అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నా రు. ప్రస్తుతం ఈ యాప్‌ను విజయవాడ, గుం టూరు నగరాల్లో అందిస్తున్నామన్నారు. అమరావతిలో మెడికల్ యూనిట్ ప్రారంభం తొలి అడుగు మాత్రమేనన్నారు. వృద్ధులకు సహా యం చేయడం, శస్త్రచికిత్స అనంతరం పునరావాసానికి మద్దతునివ్వడం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నిర్వహణ, వినూత్నమైన బైక్ అం బులెన్స్‌ల ద్వారా సహాయం అందిస్తామన్నారు. దీర్ఘాయూష్మాన్ సిబ్బంది పాల్గొన్నారు.





చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన ప్రదర్శన, తిలకించిన విద్యార్థులతో వైద్యబృందం

వైద్య విజ్ఞానం లక్ష్యంగా..

చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన

- మూడు జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థుల సందర్శన



మెదడు ఎదుగుదల లోపం వల్ల ఉండే పసికందుల ఆకృతులు

గన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో గత ఐదు రోజులుగా నిర్వహించిన ఆరోగ్య అవగాహన ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి ఏడు వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను వీక్షించారు. వైద్య విద్యార్థులు విజ్ఞానాంశాలను వివరిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల కేకేఆర్ గౌతమ్ హ్యాపీ వ్యాలీ, గూడవల్లి కేకేఆర్ గౌతమ్, స్రవంతి హైస్కూల్, కానూరు వీఆర్ సిద్ధార్థ, లా కళాశాల, విమ్స్ నర్సింగ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఇస్లామిక్ కాలేజ్, దర్గా స్కూల్, శ్రీచైతన్య కళాశాల, గురుకుల కళాశాల, చేబ్రోలు ఫార్మసీ కళాశాల, బ్రిలియంట్ స్కూల్, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, పీవీపీ సిద్ధార్థ కళాశాలల నుంచి 1500 మంది విద్యార్థులు వైద్య విజ్ఞాన ప్రదర్శనలను తిలకించారు.

ఎనాటమీ, ఎముకలు, కీళ్లు, స్త్రీలు, ప్రసూతి, కార్డియాలజీ, కిడ్నీ, న్యూరాలజీ, జనరల్ సర్జరీ, కంటి విభాగం, మైక్రో బయోలజీ, ఈఎన్‌టీ, పాథాలజీ, బయో కెమిస్ట్రీ, ఫోరెన్సిక్, ఫిజియాలజీ, ఫాంకాలజీ వంటి మొత్తం 32 స్టాల్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎనాటమిలోని భాగాలను వివరించారు. అస్థి పంజరాలు, మెదడు ఎదుగుదలలో లోపం, మెదడు, గుండె, కిడ్నీ, కపాలంలో మెదడు, గుండె పంపింగ్, ల్యాప్రోస్కోపి, సీపీఆర్, మత్తు ఇవ్వడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యం పట్ల అందరికీ అవగాహన పెంపొందించేందుకు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాజం ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాల్ అనారోగ్యమేనన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్, డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.అనిల్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్యాణిశ్రీ, సూరపనేని రాజగోపాల్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

డెంటల్ కళాశాలలో..

డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్‌ప్లోర్-25 ఎగ్జిబిషన్ జరుగుతోంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. రామోజీరావు, ఏవో వై.మధుసూదనరావు, హెచ్‌వోడీల ఆధ్వర్యంలో తొమ్మిది విభాగాల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు మాట్లాడుతూ రూ.75 లక్షలతో అధునాతన క్యాడ్ క్యామ్ డిజిటల్ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పన్ను తయారు చేసి గంట వ్యవధిలో అమర్చటం జరుగుతుందన్నారు. గతంలో వారం, పది రోజులు పట్టేదని వివరించారు. హెచ్‌వోడీలు అన్నే కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో

అరుదైన ఆపరేషన్

- అన్యూరిజం శస్త్రచికిత్స
- న్యూరోసర్జరీ విభాగం ఘనత

విజయవాడ (ప్రభుత్వాసుపత్రి), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జనరల్ ఆసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో న్యూరో సర్జరీ విభాగంలో వైద్యులు అన్యూరిజం శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అపస్మారక స్థితిలో ఉన్న పాలకొల్లుకు చెందిన కారు డ్రైవర్ కందని రమేష్ అనే వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చినట్టు న్యూరో సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ బాబ్జీ శ్యామ్‌క్రుమార్ తెలిపారు. పరీక్షల అనంతరం అతని మెదడులోని రక్త నాళా ల్లో బుడగ వంటి కణితి పగలడం వలన అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు గుర్తించామన్నారు. 15 రోజుల కిందట రోగికి అన్యూరిజం శస్త్రచికిత్స చేసినప్పటికీ, పూర్తిగా కోలుకునే వరకు తమ పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిపారు. న్యూరోసర్జరీ విభాగ సిబ్బంది సహకారంతోనే శస్త్రచికిత్సను విజయవంతంగా చేయగలిగామన్నారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో బ్రెయిన్ అన్యూరిజం కేసులను క్లిప్పింగ్ ద్వారా నయం చేస్తున్నట్టు జీజీహెచ్ అధికారులు తెలిపారు. ప్రజలు సేవలను వినియోగించుకోవాలన్నారు. శస్త్రచికిత్సను విజవంతంగా చేసిన న్యూరోసర్జరీ విభాగం హెడ్‌తో పాటు బృందాన్ని శుక్రవారం సిద్ధార్థ మెడికల్ కాలేజీ (ఎస్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వై.రావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అభినందించారు.



కోలుకున్న రోగితో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ ప్రిన్సిపాల్ ఏ.వై.రావు, న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ బాబ్జీ శ్యామ్‌కుమార్, వైద్య బృందం

అన్యూరిజం అంటే..

అన్యూరిజం అంటే మెదడులోని రక్తనాళాల్లో బలహీనమైన ప్రాంతం ఉబ్బడం వల్ల ఏర్పడే కణితి. ఇది పగిలితే మెదడులో రక్తస్రావం (హెమరేజిక్ స్ట్రోక్) కలిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. తీవ్రమైన తలనొప్పి, వాంతులు, పక్షపాతం, మూర్ఛ వంటివి అన్యూరిజం లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టరును సంప్రదించాలని వైద్యులు తెలిపారు.

ప్రమాదాల నియంత్రణపైనే దృష్టి

- నిబంధనల ఉల్లంఘనులపై ట్రాఫిక్ కొరడా

గడచిన 18 నెలల్లో జరిగిన ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులకు చెక్ పెట్టే లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమైంది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 2024లో 1,343 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 432 మంది మరణించగా, 1,154 మంది తీవ్ర, స్వల్పగాయాల పాలయ్యారు. 2025 జనవరి నుంచి జూన్ వరకు జరిగిన 589 రోడ్డు ప్రమాదాల్లో 201 మంది మరణించారు. 512 మంది గాయాలపాలయ్యారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా నిర్లక్ష్యంగా, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం వల్లే ఈ ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. హెల్మెట్ లేకుండా బైక్ నడిపి, ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహన చోదకులు అత్యధికంగా మరణించారు. గడచిన 18 నెలల్లో జరిగిన ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. వీటికి చెక్ పెట్టేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమైంది. భద్రత నియమాలు పాటించని, మోటారు వాహన చట్టం ఉల్లంఘిస్తున్న వారిపై జరిమానాల కొరడా ఝుళిపిస్తోంది.

నెలకు రూ.కోటి చొప్పున జరిమానా

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ట్రాఫిక్ పోలీసులు విధించిన జరిమానాలు లెక్కలు మోటారు వాహన చట్టం ఉల్లంఘనులను తేటతెల్లం చేస్తోంది. నెలకు సగటున రూ. కోటి పైనే జరిమానా విధించినా వాహన చోదకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదనేది పోలీసుల అభిప్రాయం. ఆరు నెలల్లో 1,17,406 కేసులు నమోదు చేసి రూ. 6,08,27,600 జరిమానా విధించారు. వీటిల్లో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన కేసులు అత్యధికంగా 1,07,617 ఉన్నాయి. ఈ కేసుల్లో మొత్తం రూ.3,74,56,200 జరిమానాగా వసూలు చేశారు. రెండో స్థానంలో మద్యం మత్తులో వాహనాలు నడిపిన కేసులు 2,105 ఉండగా, జరిమానా రూ.1,50,65, 000 విధించారు.

కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గతానికి భిన్నంగా ట్రాఫిక్ వ్యవస్థను పోలీసు ఉన్నతాధికారులు పటిష్టం చేశారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసులను పర్యవేక్షిస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు, పటమట, జాతీయ రహదారులపై అక్కడక్కడా వీటిని ఏర్పాటు చేశారు. వాహన చట్టం ఉల్లంగించి వాహనం నడిపిన వారి ఫోటోలు, బైక్ నెంబర్‌తో సహా తీసి వెంటనే ఈ-చలనాను సిద్ధం చేసి రిజిష్టర్ మొబైల్‌కు పంపుతుంది. పోలీసుల కళ్లు గప్పినా, వీటి నుంచి మాత్రం తప్పించుకోలేరు. కొన్ని కొన్ని సందర్భాల్లో పోలీసులు జాలిపడి వదిసినా.. కెమెరాలు మాత్రం వదిలిపెట్టవు. ఎలాంటి సిఫార్సులు కెమెరాలకు వినపడవు. ఎమ్మెల్యే, ఎంపీ, మినిస్టర్, పోలీస్, ప్రెస్, లాయర్ వంటి స్టిక్కర్లను ఇవి ఖాతరు చేయవు. కెమెరాల పనితీరు మెరుగైన తరువాతనే ఉల్లంఘనుల కేసులు అత్యధికంగా నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.



భారీగా జరిమానా

మద్య తాగి వాహనం నడిపుతూ పట్టుబడితే కనిష్ఠంగా రూ.10 వే లు, గరిష్ఠంగా రూ.15 వేలు జరిమానా విధిస్తున్నారు. ఈ కేసులు జనవరిలో 197, ఫిబ్రవరిలో 257, మార్చిలో 392, ఏప్రియల్‌లో 472, మే లో 383, జూన్‌లో 404 నమోదు చేశారు. వీరికి విజయవాడలోని ఆరో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. హెల్మెట్ లేకుండా వాహ నం నడిపిన వారికి రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు జరిమానా వేస్తున్నారు. మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన 593 మందికి రూ.5..93 లక్షలు, సీట్‌బెల్ట్ ధరించకుండా కారు నడిపిన 202 మందికి రూ.1,33,600, అధిక వేగంతో ప్రమాదకరంగా వాహనాలు నడిపిన 4,782 మందికి రూ.55,48,400, పబ్లిక్ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసిన 1,542 మందికి రూ.15,42,000, సిగ్నల్ వద్ద ఆగకుండా దూసుకుంటూ వెళ్లిన 30 మందికి రూ.30 వేలు, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడిపిన 84 మందికి రూ.8,400, అధిక లోడు రవాణా చేస్తున్న 451 మందికి రూ.4,51,00 జరిమానా పడింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500



ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ విడుదల

గుడ్లవల్లేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం కోసం ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా నోటిఫికేషన్ జీవోను గురువారం విడుదల చేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి 20 రోజుల లోగా దేవాదాయా, ధర్మాదాయ చట్టములో నిర్ణయించిన ప్రోఫార్మా-2 ప్రకారము దరఖాస్తులను కార్యనిర్వహణాధికారి కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం వారికి పంపవలసినదిగా కొండలరావు విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలను దేవస్థాన కార్యాలయం వద్ద తెలుసుకోగలరని ఆయన తెలిపారు.



సుధాకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

వడ్లమూడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

నందివాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, వడ్లమూడి రాఘవేంద్రరావు గత వారం రోజుల కితం మరణించటంతో వారి కుమారుడు వడ్లమూడి సుధాకర్ కుటుంబసభ్యులను శుక్రవారం పొలుకొండలో సుధాకర్ ఇంటి వద్ద కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల డీసీ అధ్యక్షుడు ఏసుబాబు, సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ కుమారి, బాలినేని నాగేశ్వరరావు, గంగాధర్, రవి, బాబుజీ, బొర్రా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, చంటిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చందురెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న నాదెండ్ల

జనసేనలో పలువురి చేరిక

గుడివాడ : జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నందివాడ మండలం ప్రముఖులు సామాజికవేత్త కొండపల్లి చంద్రశేఖర్‌రెడ్డి(చందురెడ్డి) శుక్రవారం తెనాలిలోని మంత్రి కార్యాలయంలో పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలను సత్కరిస్తున్న జనసేన నేత పవన్

మంత్రి నిమ్మలను కలిసిన జనసేన నేతలు

గుడివాడ : రాష్ట్ర సచివాలయంలోని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి చాంబర్‌లో మంత్రి నిమ్మల రామానాయుడును శుక్రవారం జనసేన నాయకులు సందు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కూనపురెడ్డి కల్యాణ కృష్ణయ్య, నాయకులు వంగలపూడి రాము, గరికిపాటి బాలాజీ, పెన్నేరు చంటి, గాదె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించాలి

గుడివాడ : గుడివాడలోని మల్లాయిపాలెం రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నారని, 9వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గుడివాడ-భీమవరం, భీమవరం-గుడివాడ వైపునకు వచ్చే వాహనాలకు మల్లాయిపాలెం గేటు మీదగా అనుమతులు లేవని డీఎస్పీ ధీరజ్ వినీల్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరం నుంచి వచ్చే వాహనాలు ముదినేపల్లి మండలం సింగరాయపాలెం, చెన్నూరు, వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు మీదగా గుడివాడకు, గుడివాడ నుంచి గుడ్లవల్లేరు, విన్నకోట ముదినేపల్లి మీదగా భీమవరం వాహనాలు ప్రయాణించాలని సూచిస్తూ రూట్‌మ్యాప్‌ను వెల్లడించారు. ఆయా మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపునకు వాహనదారులు సహకరించాలని డీఎస్పీ కోరారు.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌లో టాపర్స్‌కి అవార్డులు 13న

గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారిచే నిర్వహిస్తున్న వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు మెమోరియల్ అవార్డులు 17వ వార్షిక అవార్డుల ప్రధానోత్సవం ఆగస్టు 13 తేదీ బుధవారం నాడు గుడ్లవల్లేరు ఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ వేదికగా నిర్వహించనున్నామని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌లో టాపర్స్‌కి ఈ అవార్డులను ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. అవార్డులను స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ శాఖ సెక్రటరీ జి.వి.వి సత్యనారాయణమూర్తి ప్రదానం చేయనున్నారని రాజశేఖర్ తెలిపారు.



గవర్నర్‌కు పోస్టుకార్డులను పంపుతున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

గుడివాడ : గుడివాడ-కంకిపాడు రహదారిలో మిగిలి ఉన్న 4కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి పరచాలని, రహదారి ప్రమాదాల్లో చనిపోయిన, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, రహదారిపై భారీ వాహనాల రాకపోకలను నిషేదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ భవిష్యత్ భద్రతా దళం పోస్టుకార్డులను రాష్ట్ర గవర్నర్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా గురువారం పంపినట్లు భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళం సభ్యులు మహ్మమద్ తాహెర్ బాషా, జి.పూర్ణచంద్రరావు, సయ్యద్ నజీర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో శిథిలావస్థకు చేరుకున్న అగ్నిమాపక కేంద్రం స్థానంలో 15 ఆర్థిక సంఘనిధులు రూ.1.25కోట్లతో నూతనంగా నిర్మితమయ్యే భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సేవల్లో ఒకటైన పామర్రు అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని గమనించి నూతన భవన నిర్మాణ అవసరాన్ని ప్రభుత్వానికి నివేదించామన్నారు. దీనితోపాటుగా అర్హతగలవారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంతోపాటుగా మరో వారంలో జుల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించడం తమ ప్రభుత్వానికి ఒకమైలురాయి కానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జిల్లా అగ్నిమాపక కేంద్ర అధికారి డి.ఏ సురత్నం, పామర్రు ఫైర్ ఆఫీసర్ ఎన్.రాంబాబు, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ జి.శ్రీనివాస్, డీఈ వెంకటరెడ్డి, ఏఈ వైగోపీకృష్ణ, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

పామర్రు: ప్రజల చిరకాల వాంఛగా నిలిచిన జుజ్జవరంలోని ఓఎన్‌జీ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల వ్యయంతో నిర్మాణం కానున్న రహదారికి శుక్రవారం ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా భూమి పూజచేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అమ్మవారి సంబరంలో పార్టీ శ్రేణులతో కలసి పాల్గొని ప్రత్యేక పూజాధికాలు జరిపించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, పంచాయతీ రాజ్ ఏఈ రామారావు పాల్గొన్నారు.

కూచిపూడి: సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకెళ్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. నిడుమోలు గ్రామంలో శుక్రవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని కూటమి నేతలు, కార్యకర్తలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ ఏ కుటుంబంలో ఏ పథకం ద్వారా ఎంత లబ్ధిపొందారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ గ్రామస్థులు లేవనెత్తిన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీ దాస్, గొంతుపులి వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, తాతా నారాయణరావు, పాల్గొన్నారు.

కూచిపూడి: పామర్రు నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పేద వర్గాల వారికి 13 నెలల కాలంలో 350 మంది రోగులకు రూ.2.50 కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పార్టీలు చూడకుండా వారి ఇబ్బందులు మాత్రమే చూశామని తెలియజేస్తూ కోసూరులో వైసీపీ నేత డొక్కు ప్రసాదరావుకు హాస్పటల్ ఖర్చుల నిమిత్తం రూ.91 వేల చెక్కును శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కోసూరులో అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, దేవినేని రమేష్, తాతా నారాయణరావు, వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: మండల పరిధిలోని గురువిందగుంటలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న దుంగ గంగారత్నంకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 46,051ల చెక్కును ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం అందజేశారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలసి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి ఈ చెక్కును అందజేశారు.

పెదపారుపూడి : మండల పరిధిలోని గురువిందగుంటలో ఇటీవల గంజి బాపిరాజు భార్య మృతి చెందగా, ఆ కుటుంబాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



బందెల దొడ్డిలో పశువులను తరలిస్తున్న సిబ్బంది

బందెలదొడ్డికి పశువుల తరలింపు

గుడివాడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ పరిధిలో రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న సుమారు 100పశువులను బందెలదొడ్డికి తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక బందెల దొడ్డిలో పశువులను ఆయన పరిశీలించారు. ఎవరైన సదరు పశువుల యజమానులు సోమవారం పురపాలక సంఘంలో రూ.10వేలు అపరాధ రుసుం చలానా కట్టి, ఇకపై పశువులను రహదారులపై విడిచిపెట్టమని హామీ పత్రం సమర్పించి, తమ పశువులను తీసుకువెళ్లవచ్చునన్నారు. లేకపోతే వాటిని గోశాలకు తరలిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న రామకృష్ణ

వృద్ధులకు అన్నదానం

గుడివాడ : స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో చింత పుల్లయ్య వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు, పేదలకు శుక్రవారం పుల్లయ్య కుటుంబసభ్యులు, ఆర్.కె బృందం సంయుక్త ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) మాట్లాడుతూ అన్నదానం పరబ్రహ్మ స్వరూపమన్నారు. బీజేపీ నాయకులు లంకె రాంబాబు, గాదె చరణ్, మహ్మమద్ హుసేన్, అయ్యప్ప, ఆర్‌కే వారియర్స్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. శుక్రవారం మల్లాయిపాలెంలో డీఎస్పీ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు అందరూ ప్రత్యేకంగా హెల్మెట్ ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలు త్వరగా కట్టించాలని కోరారు. వాహనదారులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే ఆలోచన విధంగా పోలీసు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వాహనాలు తాగి నడిపితే ఎదురుగా వచ్చే వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని తెలియజేయాలన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

ప్రతీ వాహనదారుడు తాము వాహనం నడపటమే కాకుండా భద్రతా ప్రమాణాలు పాటించి ఎదురువచ్చే వాహనాలకు అనుగుణంగా తమ వాహనాలను డ్రైవ్ చేయాలని కోరారు. బండికి సంబంధించి ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వాహనాలు కండిషన్‌లో ఎప్పటికప్పుడు ఉంచుకోవాలని ఆయన కోరారు. ఎస్సై చంటిబాబు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

●రూ.15వేలు స్వాధీనం

గుడ్లవల్లేరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూరాడ లాకుల దిగువన కొబ్బరితోటలో శుక్రవారం పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గుడ్లవల్లేరు పోలీసులు శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసిననట్లు గుడ్లవల్లేరు పోలీసులు తెలిపారు.

పెట్రోల్ బంకుపై దాడి

● ఫర్నీచర్ ధ్వంసం

గుడ్లవల్లేరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌతవరం పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం బంకులో ఉన్న బంకు మేనేజర్ రామును బొంతు శ్రీనివాసరావు అనే వ్యక్తి వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈ విషయంలో పెద్ది వీరాంజనేయులు అనే వ్యక్తి మాట్లాడుతుండగా శ్రీనివాసరావు స్నేహితులు సాయి, మరో నలుగురు వ్యక్తులు పెట్రోల్ బంకులో ఉన్న కుర్చీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. బంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావు, అతని స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లవల్లేరు పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ హాళ్ల ప్రారంభోత్సవం నేడు



కలాసమాలపల్లిలో మల్టీపర్పస్ కమ్యూనిటీహాలు భవనం

తోట్లవల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు, శివారు కలాసమాలపల్లి గ్రామాల్లో రూ. 67 లక్షలతో నిర్మించిన రెండు భారీ కల్యాణమండపాలను ఎంపీ వల్లభనేని బాలశౌరీ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం ప్రారంభోత్సవం చేయనున్నారని మండల పీఆర్ ఏఈ శరాబందిరాజు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ 25 లక్షలు, నాటి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ఎంపీ నిధులు రూ. 10 లక్షలు కలిపి మొత్తం 35 లక్షలతో కమ్యూనిటీహాలుకి తోట్లవల్లూరు దళితవాడలో 2019 ఫిబ్రవరి 13న నాటి టీడీపీ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన శంకుస్థాపన చేశారు. ఈ భవనం నిర్మాణం పూర్తయి చాలాకాలం అయింది. అలాగే కలాసమాలపల్లిలో నాటి వైసీపీ ప్రభుత్వంలో ఎంపీ వల్లభనేని బాలశౌరీ, నాటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఎన్‌హెచ్‌పీసీ కంపెనీ వారి సీఎస్ఆర్ నిధులు రూ. 32 లక్షలతో మల్టీపర్పస్ కమ్యూనిటీహాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది కూడా పూర్తయి ఏడాదికి పైగా అయింది. ఈ రెండు కమ్యూనిటీహాళ్ల ప్రారంభోత్సవానికి నోచుకుంటున్నాయి.



దళితవాడలో నిర్మించిన కమ్యూనిటీహాలు భవనం

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



గుడివాడలో..

శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో భక్తులు వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

గుడివాడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌరీశంకరస్వామి దేవస్థానంలో, విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో మహాలక్ష్మీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచే విశేష అభిషేకాలు, అమ్మవారికి అర్చనకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సుహాసినీల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బొమ్ములూరు, మోటూరు, దొండపాడు తదితర గ్రామాల్లోని శివాలయాలు, వైష్ణవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పామర్రులో..

గుడ్లవల్లేరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా వేమవరం కొండాలమ్మ అమ్మవారు వరలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామునే అమ్మవారికి పంచామృతాభిషేకము, సహస్ర నామ కుంకమార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారికి పంచహారతులు ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శివ సంతోష్ శర్మ పూజలు నిర్వహించారు.

కూచిపూడి : శ్రావణ మాసం మూడవ శుక్రవారం మహిళలు సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గృహంలో పూజాది కార్యక్రమాలు జరుపుకుని వాయినాలు అందజేశారు. కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారి వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినముత్తేవి, పెదపూడి, యద్దనపూడి, పెడసనగల్లు, అయ్యంకి, నిడుమోలు, కాజ, కోసూరుగ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తోట్లవల్లూరులో..

పామర్రు : శ్రావణ మాసంలో పౌర్ణమిముందు వచ్చే శుక్రవారం పురస్కరించుకుని పామర్రు పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలతోపాటు దేవాదాయ శాఖ అధీనంలో దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం మహిళలు వారి ఇళ్లలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ముగించుకుని సమీపంలోని అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తమను ఎల్లవేళలా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వరలక్ష్మీదేవి అమ్మవారిని వేడుకొన్నారు. స్థానిక పాతాళేశ్వరమ్మతల్లి, అంకమ్మతల్లి, వాసవీ మాత, గంగానమ్మతల్లి ఆలయాలలో ప్రత్యేక అలంకారాలతో భక్తులకు అమ్మవార్లు దర్శనమిచ్చారు.



కూచిపూడిలో..

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో పవిత్ర శ్రావణ శుక్ర వారం సందర్భంగా వేణుగోపాలస్వామి దేవస్థానంతో పాటు పలు ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ దేవి వ్రత పూజలు నిర్వహించారు. గృహాల్లో వరలక్ష్మీ దేవి వ్రతం చేసి అమ్మవారికి నైవేద్యాలు అర్పించారు.



గుడ్లవల్లేరులో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

కోడూరు-మచిలీపట్నం బస్సు తాత్కాలికంగా నిలిపివేత

కోడూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉల్లిపాలెం వారధి మీదుగా కోడూరుకు రోజూ నడుపుతున్న 4 బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్టు మచిలీపట్నం డిపో మేనేజర్ పి.పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం సమీపంలో రోడ్డు కల్వర్టు పనులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పని పూర్తి కాగానే బస్సులు యథాతథంగా నడుస్తాయని, ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.



నాగేశ్వరరావుపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్‌ఎఫ్

బంటుమిల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలను ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) ఆపన్న హస్తంలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం నాగేశ్వరరావుపేటలోని తన ఇంటి వద్ద ఆరోగ్య సమస్యలకు చికిత్సలు పొందిన 23 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన రూ.19,67,477ను ఆయన పంపిణీ చేశారు. కూనపరెడ్డి వీరబాబు, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు పాల్గొన్నారు.



మోపిదేవిలో మాట్లాడుతున్న టీడీపీ మండల నాయకులు

కనపర్తిపై ఆరోపణలు తగదు

● పార్టీ ఐక్యతను దెబ్బతీయాలని చూసే బయటి వ్యక్తుల ప్రయత్నాలు సాగనివ్వం: టీడీపీ మండల నాయకులు

మోపిదేవి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): 'మండలంలో పీఏసీఎస్‌లు, సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎంపికలో పార్టీ మండల కమిటీ ఇచ్చిన జాబితానే నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు పార్టీ రాష్ట్ర కమిటీకి పంపి ఆమోదం తీసుకున్నారు. ఆయనపై ఆరోపణలు తగదు. కొక్కిలిగడ్డ సొసైటీ విషయంలో జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు అసంతృప్తిగా ఉన్న మాట వాస్తవమే. కొందరు మల్లికార్జునరావును తమ స్వార్థ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టి లేనిపోని అలజడి సృష్టించారు. మల్లికార్జునరావుతో మేమంతా కలిసి పనిచేస్తాం. మండలంలో పార్టీ ఐక్యతను దెబ్బతీయాలని కొందరు బయట వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలను సాగనివ్వం.' అని టీడీపీ మండల నాయకులు నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, చందన రంగారావు స్పష్టం చేశారు. కనపర్తి శ్రీనివాసరావుపై గురువారం కొందరు చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను టీడీపీ మండల కమిటీ శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఖండించింది. గురువారం రాత్రి పార్టీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, పార్టీ సీనియర్ నేత మండవ బాలవర్ధిరావు తదితరులు మెడబలిమికి నచ్చచెప్పేందుకు వెళ్లారని, వారు కనపర్తిని, పార్టీని దూషించినట్లుగా కొన్ని పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ రావి దుర్గావాణి, మాతంగి వెంకటేశ్వరమ్మ, మోర్ల జయలక్ష్మి, దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, టీడీపీ నాయకులు చందన రంగారావు, దొప్పలపూడి జగదీష్, కోనేరు నాగేశ్వరరావు, బల్ల సీతారామప్రసాద్, పుప్పాల శివరామకృష్ణ, బాలకోటేశ్వరరావు, కం దుల బసవయ్య పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి కనపర్తి విశేష కృషి

● ఆయనపై ఆరోపణలు అర్థరహితం

● దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

అవనిగడ్డ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుపై కొందరు వ్యక్తిగత స్వార్థంతో ఆరోపణలు చేయడం తగదని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ సొసైటీ విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభనపై పార్టీకి సంబంధం లేని వారు అనవసరపు రాద్ధాంతం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, కనపర్తి శ్రీనివాసరావుపై అనవసరపు ఆరోపణలు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో సొసైటీల అధ్యక్షుల ఎంపికపై పార్టీ గ్రామ, మండల కమిటీల అభీష్టానికి అనుగుణంగానే పేర్లను అధిష్టానానికి పంపించారని, సీనియారిటీ ప్రాతిపదికగా తాము పేర్లను ప్రతిపాదిస్తే ఒకటికి నాలుగుసార్లు పరిశీలన జరిపి చైర్మన్ల పేర్ల జాబితాను అధిష్టానానికి పంపించారని తెలిపారు. నేతలు పరుచూరి దుర్గా ప్రసాద్, కర్రా సుధాక ర్, ఘంటసాల రాజమోహనరావు, బండే రాఘవ, అడపా శ్రీను, షేక్ బాబావలి, మేడికొండ విజయ్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు

విజయవంతం చేయాలి

● ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పిలుపు

చల్లపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో జిల్లా నుంచి పాల్గొనబోయే ప్రతినిధులను ఎంపిక చేశామని తెలిపారు. జిల్లా నుంచి 200 మందిని సమీకరించాలని కార్యవర్గ సమావేశంలో నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, దేశవ్యాప్తంగా రైతాంగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. మూడవ ప్రత్యామ్నాయం దిశగా కమ్యూనిస్టు పార్టీలు, కలిసొచ్చే ఇతరులతో కలిసి భవిష్యత్తు నిర్మాణానికి రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, కమ్యూనిస్టుల ఐక్యతకు దారితీసేవిధంగా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. 23వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని, ఈ ప్రదర్శనలో వేలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, కార్యవర్గ సభ్యులు కాట్రగడ్డ రామచంద్ర జోషిలు పాల్గొన్నారు.

11న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కంకిపాడులో నూతనంగా నిర్మించిన రాఘవేంద్ర ఆయుర్వేద నిలయంలో ఈనెల 11న ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ ఎస్పీఎస్ రవళి తెలిపారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంగినపూడి జనసేన నాయకుడు గోవింద నాగేశ్వరరావు కోరారు.

దాహార్తి తీరేనా..

● చాన్నాళ్లుగా నగర ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా

● సమస్య పరిష్కారానికి 11 రిజర్వాయర్లు అడిగితే మంజూరైంది రెండే

● నిర్మించి ఐదేళ్లయినా నిరుపయోగంగా గిలకలదిండి రిజర్వాయర్

(మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి)

నగర జనాభా పెరుగుతున్నప్పటికీ తగినంతగా తాగునీరందడం లేదు. ఇప్పుడు జనాభా రెండు లక్షలు ఉంది. పోర్టు నిర్మాణం పూర్తయితే జనాభా మరింత పెరిగే అవకాశముంది. చాలా కాలంగా నగర ప్రజలకు రోజువిడిచి రోజు తాగునీరందిస్తున్నారు. మురికివాడల్లో తగినంతగా తాగునీరందడం లేదు. నగరంలో 19 రిజర్వాయర్లు ఉన్నాయి. పెరిగిన జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతనంగా ఏర్పడిన కాలనీల్లో రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉంది. ఆరేళ్ల క్రితం గిలకలదిండిలో నిర్మించిన రిజర్వాయర్ ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. మత్స్యకారులు నివసించే ఈ ప్రాంతానికి బందరు కోటలోని సంపు ద్వారానే తాగునీరందిస్తున్నారు.

> ### నాలుగైదు రోజుల్లో రిజర్వాయర్ ప్రారంభిస్తాం
>
> గిలకలదిండి రిజర్వాయర్ ఇదివరకే నిర్మించినా పైపులైన్ల నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఇప్పుడు వాటి నిర్మాణాలు పూర్తిచేశాం. నాలుగైదు రోజుల్లో రిజర్వాయర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభిస్తారు. గిలకలదిండి ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీరతాయి.
>
> - బాపిరాజు, మునిసిపల్ కమిషనర్

గిలకలదిండి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తే ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు తగినంత అందే అవకాశం ఉంది. గిలకలదిండి ప్రాంతంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా మరో రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. నగరంలోని టైలర్స్ కాలనీ, దేవాంగుల కాలనీ, కాలేఖాన్‌పేట, గాంధీ విద్యాలయం ప్రాంతం, హిందూ కళాశాల ప్రాంతం, శ్రీనివాసనగర్, హౌసింగ్ బోర్డు, బందరుకోట, ఈడేపల్లి, జలాల్‌పేట, గిలకలదిండి ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 11 రిజర్వాయర్లు నిర్మించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రణాళికలు రూపొందించమని అధికారులను ఆదేశించారు. ఈ 11 ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణానికి అంచనాలు పంపారు. అయితే జలాల్‌పేట, గిలకలదిండిలో మాత్రమే రిజర్వాయర్లను పబ్లిక్ హెల్త్ ఉన్నతాధికారులు మంజూరు చేశారు. జలాల్‌పేటలో 700 కిలోలీటర్ల కెపాసిటీ, గిలకలదిండిలో మరో 700 కిలో లీటర్ల కెపాసిటీ రిజర్వాయర్లు నిర్మించేందుకు అనుమతులు లభించాయి. 11 రిజర్వాయర్ల నిర్మాణాన్ని ఆశిస్తే కేవలం రెండు రిజర్వాయర్ల నిర్మాణాలు మాత్రమే పబ్లిక్ హెల్త్ ఉన్నతాధికారులు అనుమతులిచ్చారు. మిగిలిన 9 ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మిస్తే తాగునీటి ఇబ్బందులు తీరతాయి. చాలా కాలంగా కృష్ణా నది నుంచి నేరుగా మచిలీపట్నానికి పైపులైన్లు నిర్మించే మెగా ప్రాజెక్టు కలగానే మిగిలిపోయింది. విజయవాడ కృష్ణానది నుంచి మచిలీపట్నానికి నేరుగా పైపులైన్లు వేస్తే మచిలీపట్నానికే కాకుండా దారిలో ఉన్న పెనమలూరు, ఉయ్యూరు, పామర్రు, నిడుమోలు, గూడూరు ప్రాంత ప్రజలకు తాగునీరు అందుతుంది. ఇప్పటికే తరకటూరు సమ్మర్ స్టోరేజ్ నుంచి మచిలీపట్నం ప్రజలతో పాటు పెడన, గూడూరు మండలాలకు తాగునీరందిస్తున్నారు. బందరు డివిజన్‌లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృష్ణానది నుంచి పైపులైన్ల నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.



గిలకలదిండిలో నిరుపయోగంగా ఉన్న ఐదేళ్ల క్రితం నిర్మించిన రిజర్వాయర్

నగరంలో రాఖీ పౌర్ణమి సందడి



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర ప్రేమకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి శనివారం జరుపుకోనున్న సందర్భంగా శుక్రవారం నగరంలో సందడి నెలకొంది. రాఖీల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మాజేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. బే ఎక్స్‌టెన్షన్ పనుల నిమిత్తం సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్తమూరులో..

బంటుమిల్లి: అర్తమూరులో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవిందరాజులు తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు పెదతుమ్మిడి, చినతుమ్మిడి, రామవరపుమోడి, లక్ష్మీనారాయణపురం, గార్లగుంట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పులిగడ్డ గురుకుల విద్యాలయంలో

ప్రవేశానికి దరఖాస్తులు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల విద్యాలయంలో 5వ తరగతిలో 24 సీట్లు, 7వ తరగతిలో 2 (ఓసీ-1, బీసీ-ఎ 1) మిగిలి ఉన్నాయని, వాటిలో ప్రవేశానికి విద్యార్థులకు మరొకసారి దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్టీపీ కుమార్ తెలిపారు. 87126 25033కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

నాగాయలంక, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఇంటి వద్ద వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

కనకదుర్గమ్మ నిమ్మకాయల అలంకారం

కోడూరు: కనకదుర్గమ్మ ఆలయాన్ని అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. అమ్మవారికి మూలమూర్తికి పుష్పార్చన, కుంకుమార్చన చేశారు.

నాంచారమ్మకు గాజుల అలంకారం

చల్లపల్లి: లక్ష్మీపురంలోని బాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీ నాంచారమ్మ ఆలయంలో అమ్మవారికి గాజులతో విశేష అలంకరణ చేశారు.చల్లపల్లిలోని సంపటాలమ్మ, రామలింగ చౌడేశ్వరి, అన్నపూర్ణాదేవి, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



గాజుల అలంకారంలో లక్ష్మీపురం నాంచారమ్మ, నిమ్మకాయల అలంకారంలో కోడూరు కనకదుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

మచిలీపట్నం టౌన్: ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, రామలింగేశ్వరస్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, ఈడేపల్లి శక్తిగుడి, భాస్కరపురం త్రిశక్తి పీఠం, గంగానమ్మ, మహాలక్ష్మి, సర్కిల్‌పేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు జరిపారు.



రేవతి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకిద్దాం

● ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం : సీపీఎం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)ను వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం రేవతీ సెంటర్‌లో ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలు తప్పులు తడకగా ఉన్నాయని, ఎన్నికల కమిషన్ కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నగర కన్వీనర్ చిరువోలు జయరావు, గీత కార్మిక సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, కేవీ గోపాలరావు, దుర్గా ప్రసన్నుడు, యూనస్, ఈడే రామారావు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ

ఉపాధి అవకాశాలు కల్పించాలి

చల్లపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్న నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 12వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని ఆటోడ్రైవర్లకు ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం చల్లపల్లి బస్టాండ్ సెంటరులోని రేపల్లె పాయింట్ ఆటో కార్మికులతో మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహనమిత్ర పథకం కింద సంవత్సరానికి రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై విధించిన ట్యాక్స్ తగ్గించాలని కోరారు. స్వతంత్ర ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముద్రగడ రత్నగిరి, పసుపులేటి శ్రీనివాసరావు, బూరె శ్యాంసన్, పెదప్రోలు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



నవీన్‌మిట్టల్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బందరు మండలం మేకావారిపాలెం శివారు నవీన్‌మిట్టల్ కాలనీలో శుక్రవారం వారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు.

వైభవంగా వీర్లంకమ్మ సంబరం

ఘంటసాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామ ఇలవేల్పు తుమ్మలవారి ఆడపడుచు వీర్లంకమ్మ అమ్మవారి సంబరం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణ శుక్రవారం రోజున సంబరాన్ని నిర్వహిస్తారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, కొణతాలను శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదిలో తెల్లవారుజామున పవిత్ర స్నానం చేయించి, గ్రామానికి తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించి జాతరను ప్రారంభించారు. గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రతి ఇంటికీ ఆహ్వానించి పసుపు, కుంకుమలు సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.



కొత్తపల్లిలో వీర్లంకమ్మ సంబరం నిర్వహిస్తున్న గ్రామస్థులు